డి. కామేశ్వరి

# ఎప్పటికి మారేను?

"అమ్మా, నా బిడ్డ పెళ్ళి మళ్లీ నెలలో, నెలరోజులు పనికి రానమ్మా" అంది యాదమ్మ, నానెత్తిన బాంబు పేల్చినట్లయింది. అది నెలరోజులు రాకపోతే యింకొకరు దొరక్కపోతే పని ఎలాగరా బాబూ అన్నది ఒకచింత. రెండోది పట్టమని పన్నెండేళ్లు లేని ప్లిలకి పెళ్ళేమిటని ఒక బాధ.

"నీకు మతుందా లేదా? పన్నెండేళ్ళ దానికి పెళ్ళేమిటి? చదువు మాన్పించి యింట్లో కూర్చోపెట్టింది చాలక యిప్పుడు పెళ్ళికూడా చేసేసి పంపిస్తావా?" కోపంగా అన్నాను.

"ఏం సెయ్యాలమ్మా, బిడ్డ పెద్దమనిషయింది. పెళ్ళి సెయ్యాలి గదమ్మా"

"పెద్దమనిషయితే పెళ్లి చేసెయ్యాలా? మీరే కాలంలో వున్నారే ఇంకా, ఛా, ఛా - మీరు బాగుపడరే గవర్నమెంట్ వూరికే చదివించినా చదువుకోరు. ఎన్ని అక్షరసంక్రాంతులు పెడితే ఏం లాభం. వీలుండీ కాస్త నాలగక్షరం ముక్కలు నేర్చుకుందామన్న యావ మీకు లేకపోతే ఏ ప్రభుత్వం మాత్రం ఏం చేస్తుంది. ఐదోక్లాసు కాగానే స్కూలుకి పంపడం మానేసి పన్లో పెట్టేశావు. అదీ నీలానే పాచిపన్లు చేసుకుంటూ బతకాలని" ఆవేశంగా అన్నాను.

"ఏటి సెయ్యాలమ్మా, ఒక్కదాన్ని రెక్కలు ముక్కలయ్యేట్టు చాకిరి చేస్తున్నా దినం గడవలేదు. చేతికందొచ్చిన బిడ్డ అదీ రెండిళ్లు చేస్తే నాలుగు డబ్బులు కూడితే చేతికి, కాలికి నగానట్రా కూరుతుంది. దాని పెళ్ళి ఖర్చుకన్నా పనికొస్తంది గదమ్మా"

"ఏడ్చావులే - ఏం దాన్ని ఏ మెట్రిక్ వరకో చదివిస్తే ఏ చిన్న ఆఫీసులోనే ఏదో పని దొరికేది. పదో క్లాసు తరువాత ఏదన్నా ట్రైనింగ్‌కి పంపితే దాని బతుకు అది బతకగలిగేది. నాలుగురాళ్ళు సంపాదించుకొనేది. ఎంతసేపు పెళ్ళి పెళ్ళి తప్ప చదువుకొని బాగుపడాలనుకోరు మీరు."

"ఒంటరిదాన్ని - నా కాలుచెయ్యి తిన్నగా వుండగా ఓ యింటిదయితే నా బరువు తీరుతుంది అమ్మా - నాకేదయినా అయితే దాని గతేమవుతుందని నా బయం- నాకే సాయం చేయడానికి మొగుడా మొద్దులా"

'లాభం లేదు, వీళ్లకెంత చెప్పినా మారరు. మార్పురాదు. ఎలాచెప్పి నమ్మించలేని అసహాయతతో కోపం వచ్చింది' "యిలా కాదు మీ పని, యిలా పన్నెండేళ్ళ పిల్లకి పెళ్ళి

చేస్తున్నావని పోలీసులకి చెపితే జైల్లో కూర్చోపెడతారు నిన్ను. అపుడుగాని, బుద్ధిరాదు నీకు, పద్దెనిమిదేళ్ళ లోపు పెళ్ళిచెయ్యడం నేరం అని తెలుసా" దబాయించాను.

అది నవ్వేసింది నిర్లక్ష్యంగా. అలా నేను చెయ్యలేని ధైర్యం - 'అఁ యీ రూల్సు వేటికి అమ్మా. మా కులపోళ్లందరూ పిల్ల పెద్దమనిషి కాగానే సేస్తారు. ఆలస్యం సేస్తే సంబంధం దొరకదు. కులపోళ్ళు నానా మాటలంటారు.

"అదే, మీలాంటి వాళ్లందరి మీద కంప్లైంట్ రాస్తాను ఓసారి. సిగ్గులేకుండా నవ్వుతున్నావు ఘనకార్యం చేస్తున్నాట్లు. పన్నెండేళ్ల దానికి పెళ్లి. పదమూడేళ్ళకి కడుపు - అదే ఓపిల్ల , దానికో పిల్ల పుడ్తుంది రేపు. దీని ఆరోగ్యం, దాని ఆరోగ్యం ఎంత చక్కగా వుంటాయో చూస్తున్నాఉలే. గవర్నమెంట్ నెత్తీ నోరు మొత్తుకుంటుంది. ప్రకటనలు చేస్తూ - చిన్న పిల్లలకి పిల్లలు పుడితే వాళ్ళ ఎదుగుదల, బుర్ర సరిగా వుండదని, అలా కనవద్దని, కుటుంబనియంత్రణ అంటూంటే మీరేమో పదమూడేళ్ళకే పిల్లల్ని కనడం మొదలెడతారు. మీలాంటి వాళ్ళ వల్లే దేశం ఇలా తగలడుతుంది. అట్టడుగు వర్గాలంటారు. ఉద్ధరించాలంటారు, వీరికి చదువుకోవడానికి అవకాశాలు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఎన్నిరకాలు యిచ్చినా ఏం లాభం, మీరిలాగే వుంటారు. యింకా వందేళ్లు గడిచినా -" ఆవేశంగా దులిపా- అదీ అంత తేలిగ్గానే నా మాటలు దులిపేసుకుని చీపురు పట్టుకుంది వూడ్చడానికి.

యాదమ్మకి మొగుడుండీ లేనట్టే అయింది. ఉత్త తాగుబోతువాడు. కూలిపనికి వెళ్లిన నాడువెడతాడు. లేదంటే లేదు - తెచ్చిన నాల్గుడబ్బులు వాడి తాగుడికే సరిపోయేది కాదు. దీన్నితన్ని, యిది సంపాదించిన డబ్బూ పట్టుకుపోయి కొట్టి తిట్టి యాగి చేస్తుంటే దీని ప్రాణం విసిగి పంచాయితీ పెట్టించి ఆ మొగుడ్ని వదిలేసి కూతురిని పట్టుకు వేరు వచ్చేసింది. మొగుడాశలేదు. మొగదిక్కులేదు. ఏదో వంట్లో బలం వుండగా కూతురి పెళ్లి చేసేసి దాని బాధ్యత తీర్చుకోవాలని దాని తాపత్రయం. గుడ్డిలో మెల్ల ఒక్కతే పిల్ల కావడం కాస్త కోపం తగ్గాక "యింతకీ ఎవడికి కట్టబెడ్తున్నావు దాన్ని, కాస్త చదువూ సంధ్యవున్నవాడా, లేక నీ మొగుడి లాంటి వాడా?" అడిగా.

యాదమ్మ చీపురు కింద పడేసి కూర్చుని "పిల్లాడు ఎనిమిదో క్లాసు చదివాడమ్మా. ఏదో కంపెనీలో అటెండరుగా ఉద్యోగం - అత్తకి మామకి గవర్నమెంటు ఉద్యోగాలు - పెన్షన్ వస్తది - చిన్న యిల్లుంది - యీడు కాక యిద్దరాడపిల్లలు. యింకోడు చిన్న కొడుకున్నాడు. కాస్త అయిన కుటుంబమే.

'యింత మందీ కలిసే వుంటారా? దీని పెళ్ళయ్యాక'

'అదేమో అది ఆళ్ల యిష్టం. మనకేల' అనేసి నాకేంగాని యిప్పుడు పెళ్ళిఖర్చు

అది ఏడనించి తీసుకురావాలి అని తలబద్దలు కొట్టుకుంటున్నా - పిల్లకి మెడలో సూత్రం తాడు, కాళ్లకి వెండి పట్టాలన్నారు. ముక్కుకి, చెవుకి కమ్మలు, బీరువా, మంచాలడిగారు. అలకకి సైకిలడిగారు. పెళ్లినాడు ఆళ్లందరికి బోజనాలు పెట్టాలి. దీనికి పట్టుచీర, అత్తకి, ఆడబిడ్డలకి సీరలు, లిస్టుచెప్పుకు పోతుంటే తెల్లపోయాను.

'ఏమిటీ యివన్నీ చేస్తావా నీవు - ఎంతవుతుందనుకున్నావు.. ఎంత చచ్చుగా చూసుకున్నా పాతిక ముప్పైవేలవుతుంది. యిదంతా ఎలా చేద్దాం అనుకుంటున్నావు. నీకు తిండికే డబ్బులేదంటావు"

"తిన్నా తినకపోయినా ఆడపిల్ల పెళ్ళి సెయాయలంటే ఖర్చు తప్పుతుందా మరి. సేయకపోతే అత్తింట్లో దాని బతకనిస్తారా"

"అయ్యబాబోయ్ - ఏం ధైర్యమే నీకు, మమ్మల్ని మించిపోతున్నారు మీరు, యీఖర్చులేమిటి, ఏదో సింపుల్‌గా గుడిలో పెళ్లిచేసి పంపేయాలి గాని."

"అమ్మో కులంలో తలవంపులవవు - వున్నా లేకపోయినా తల తాకట్టు పెట్టి సేయాలి. ఊర్లో ఎకరా పొలం బేరం పెడతాను. మిగతాది అప్పుతెచ్చి సేసి నెలనెలా అని తీర్చుకుంటా- ఏం చెయ్యనమ్మ అదెల్లిపోతే ఒక్క మనిషిని తినితినక అప్పుసెల్లగొడ్తా' ' ఆడదైనా, చేతిలో దమ్మిడి లేకపోయినా దాని ధైర్యానికి విస్తుపోయాను.

ఊర్లో పొలం పదిహేను వేలకమ్మింది. మరి పదివేలు అప్పుతెచ్చింది. దాని ఖర్చు చూస్తే ఇది అప్పుల ఊబిలోంచి ఎలా బయటపడ్తుంది అనిపించింది. నా వంతు పిల్లకో మంచిచీర, రెండు లంగాలు, రెండు జాకెట్లు, రెండు తువ్వాళ్లు, ఓ దుప్పటి, ఏవో చిన్న వస్తువులు కొనియిచ్చాను.

పెళ్లి జరిగింది. అరవై డెబ్బైమందికి భోజనాలు పెట్టింది. అంతటిదో అయిందనుకున్నాను. "అప్పుడే ఎక్కడమ్మా, పిల్లదాన్ని సారెపెట్టి పంపాలంది. చేతిలో డబ్బు అయిపోయింది. సారె అంటే యింత చలిమిడి, పసుపుకుంకం అనుకున్న - దాని లిస్టు చూసి తెల్లపోయా- బిందెడు చలిమిడి, రెండు కేజీల లడ్లు, కిలో పసుపు, కిలోకుంకుమ, కిలో నలుగుపనిండి. ఆకు, వక్కా, అరటిపండ్ల గెల - కొబ్బరిబొండాలు, పంచదార చిలకలట.

'ఏమిటే యిది జమీందారి ఖర్చులావుంది. మింగడానికి లేకపోయినా మీసాలకి సంపెంగ నూనెలా వుంది నీ వేషాలు - మాకేలేవు యింతంత ఖర్చులు, మరేమిటి యిలా, కాస్త పేరుకి కాస్త చలిమిడి వళ్లోపెట్టి పంపక' అన్నాను కోపంగా

"నా మొగాన పూస్తారు. అక్కడెల్లి యిరుగుపొరుగుపంచి పెట్టద్దమ్మా సారె" అంది. మొత్తానికి సారె ఖర్చు పన్నెండు వందలయింది.

పిల్లని అంపకానికి పెట్టి కాళ్లు,చేతులు చచ్చుబడి చతికిలబడింది. దాని అప్పెప్పటికి తీరుతుందో దానికీ, భగవంతుడికే తెలియాలి అనుకున్నా.

కాస్త కాలు చెయ్యి కూడదీసుకుంటూందనుకునే సరికి మూడు నెలలకి సంక్రాంతి పండగొచ్చేసింది. మొదటి పండుగ. కొత్త అల్లుడిని పిలవాలంది. యిప్పటికే దాని సంపాదనంతా అప్పుమీద వడ్డీకే సరిపోతుంది.

"పండక్కి నలుపు - తెలుపు టి.వి అయినా కొనివ్వాలని కూతురిచేత ముందే రాయించాడమ్మా, యిప్పుడు మళ్లీ, టి.వి, బట్టలు, ఓ మూడు వేలన్నా కావాలి ఎక్కడతేనమ్మా?" అది తల మొత్తుకుంది.

"చాల్లే వూరుకో, యింకబుద్ధిలేని పనులు చేయకు, బట్టలు పెట్టి పంపించు, నీ తాహతింతే అని చెప్పేయి. ఏమనుకుంటున్నారు వాళ్ళు,. ఎక్కడనించి తెస్తావనుకుంటున్నారు"

"నేనెక్కడ నుంచి తెచ్చేది వాళ్లకెందుకమ్మా, మొదటి పండగక్కి అడిగిందివ్వలేదని పిల్లదాన్ని సతాయించుకు తింటారమ్మా. యీ అప్పుకి మరో యింత అప్పు తెచ్చి యివ్వాలి తప్పుతుందా" అంది.

దీని ధైర్యం మండిపోనూ అన్పించింది. బతుకున్నన్ని రోజులు అప్పులు తీరుస్తూనే వుంటుంది గాబోలు. అటు శోభని చూస్తే చిక్కి సగం అయింది. పిల్ల చక్కగా నల్లగా వున్న మంచి కళగా వుండేది. కళ్లు, వళ్లు వెళ్లుకొచ్చాయి. "ఏవే అత్తగారింట్లో తిండి పెట్టరా. నీ మొగుడు ప్రేమగా చూసాడా! ప్రేమ యీ మాటకర్థాలేం తెలుస్తాయి. పదమూడేళ్ల పిల్లకి అది మొహం తిప్పుకోడం చూసి అనిపించింది. దీని అత్త బలే గుడసరిది అమ్మా - కోడలు రంగానే పని అంతా అప్పగించేసి చక్కా ఆఫీసుకి పోతుందిట. కుండమండ కడుగుడి, నాస్తా, తిండి అన్నీ యిదే సెయ్యాలి - యీడ అటుపుల్ల యిటుపెట్టి ఎరగని పిల్ల" యాదమ్మ తల్లి ప్రాణం కొట్టుకుంది.

పండుగయి వెళ్ళింది. అల్లుడు టి.వి. పట్టుకెళ్ళాడు. మరోరెండు నెలలకి ఒకరోజు పనిలోకి రాలేదు యాదమ్మ. మర్నాడు ఏడ్చుకుంటూ మొహం పీక్కుపోయి వచ్చింది. శోభ వచ్చిందట. నెల తప్పిందట. అల్లుడు రెండువేలడిగి పత్రా అప్పులున్నాయి అని అర్డరు వేసాడట.

"పిల్లదానికి వేవిళ్లు, ఏం తిన్నా వాంతులవుతున్నాయి. అదసలే కళ్ళలో ప్రాణాలు పెట్టుకనుంటే కొడతాడట. తిడతాడట. అత్తమామ చూస్తూ ఏమనరట.

"ఎందుకు కొడతాడట?"

"ఎందుకేటమ్మ, యిదివరకు తెచ్చుకున్న జీతం అంతా సిగరెట్లు, సినిమాలు, షోకులకి, తాగుళ్లకి కర్చుపెట్టుకు తిరిగేవాడట. పెండ్లి అయ్యాక నీకు, నీపెళ్ళానికి వూరికే తిండెట్టుతమా వెయ్యి రూపాయలు ఇయ్యి ఇద్దరి ఖర్చుకి, లేదంటే వేరే పొండి అని అత్త చెప్పేసిందట. - యీడి జల్సాలకి డబ్బు తగ్గిపోయిందిగా - ఆ కోపం అంతా దీనిమీద సూపించి కొడ్తున్నాడట.

"అయింది బాగా అయింది శాస్తి నీకు, అనకూడదుకాని నాకు నిన్ను చూస్తే వళ్లు మండుకుపోతుంది: పదమూడేళ్ళకి పిల్లకి పెళ్లి, కడుపు - మొగుడిచేత తన్నులు - దాన్ని చేతులారా అనరకంలో పడేసి యిప్పుడెందుకు ఏడవడం. పెళ్ళికాకపోతే కొంపలు మునుగుతున్నట్లు పెళ్లిచేయడం, వీళ్లు పిల్లల్ని కనకపోతే దేశం నష్టపోతుందన్నట్టు పదమూడేళ్ళకే పిల్లల్ని కనడం! ప్రభుత్వం కుటుంబ నియంత్రణ గురించి ఎంత ఖర్చు పెట్టి ఎన్ని ప్రకటనలు యిచ్చినా ఏం లాభం. అదే ఆడేపాడే వయసుపిల్ల. దానికి కడుపు. అదిఎలా కంటుందే యిలా ప్రాణాలు కళ్లల్లో పెట్టుకుని, అల్లుడికి డబ్బు కావల్సినపుడల్లా బంతిని తన్నినట్లు యిక్కడికి తంతూంటాడు. ఎన్నాళ్ళిచ్చి పంపిస్తావు. యివ్వనని ఖచ్చితంగా ముందే చెప్పేయి. యిలా అలవాటు చేసి పీకలమీదకి తెచ్చుకోకు' కోపంగా మందలించి సలహా చెప్పాను.

"ఏటి సెయ్యాలో, నా కాల్లు సేతులాడ్డం నేదమ్మగోరూ - డబ్బియకపోతే పిల్లదాన్ని సంపేస్తారేంటో, ఆడిజిమ్మడ, ఆడి సేతులిరగ, కడుపుతోన్న పిల్లనిట్టా కొటతడ" అల్లుడిని తిట్టిపోసింది ఏడుస్తూ - ఏడుస్తూ వెయ్యి రూపాయలచ్చింది మళ్లీ.

మళ్లీ ఏడోనెల సీమంతం ఖర్చు - పురిటికి తీసుకొచ్చింది. కాన్పు అవకపోతే సిజేరియను - చచ్చి బతికినంత పని అయింది. డాక్టరు బండబూతులు తిట్టింది యాదమ్మని. కంప్లైంట్ యిచ్చి జైల్లో తోయిస్తానని - యింత చిన్నపిల్లకి పెళ్లి, కాన్పు ఏమిటని బెదిరించింది - ఎంత గవర్నమెంటాసుపత్రి అయినా పురుటి ఖర్చు బారసాల ఖర్చు ఏడెనిమిది వేలయింది - అది మరో అప్పు. డాక్టరు అత్తింటికి పంపేముందు తీసుకురమ్మని లూపు పెట్టించి మరో మూడేళ్ళదాకా పిల్లల్ని కనవద్దని వార్నింగ్ యిచ్చింది. బారసాల ఘనంగా చెయ్యలేదని అత్తింటివారు మూతివిరుపుల మధ్య పిల్లాడిని తీసుకెళ్ళింది శోభ- ప్రతివారికి యిప్పుడు డబ్బాశ, వస్తువుల ఆశ, సుఖాల కోసం యీజీ మనీ - అది సంపాదించే మార్గం కూతుర్నిచ్చిన అత్తవారు కనపడతారు. వీలున్నంత వరకు పిండుకునే మనస్తత్వం అలవడింది జనానికి.

యాదమ్మ శారీరకంగా, మానసికంగా చాలా దిగజారింది. చిక్కి సగమైంది. దాని సంపాదనంతా వడ్డీలు కట్టడానికే సరిపోక వంట్లో ఓపిక లేకపోయినా యింకో రెండిళ్లు

పరికి కుదరింది. దాని మొహంలో నవ్వేలేదు. ప్రేతకళ పడింది.

రెండుమూడుసార్లు వెయ్యి, రెండువేలు యిమ్మని కూతుర్ని పంపితే అది మనసు రాయిచేసుకుని యివ్వనని ఖచ్చితంగా చెప్పి పంపేసింది. చంటి పిల్లాడి, చాకిరి, అత్తింటి బాధలు, తిండికూడా సరిగా పెట్టకుండా మొగుడు, అత్త అనే మాటలకి శోభ శవంలా తయారయింది.

"చేతులారా దాని గొంతు కోశాను. మీరు సెప్పినా యినుకోలేదు. పిల్లని యిట్టా తంతే ఎన్నాళ్లు బతుకుతుంది' గోడుగోడున ఏడ్చింది.

"చాల్లే వెధవపెళ్లి చేశావు చేసిన కాపురం చాలు - నలుగురి పెద్దల ముందు యిలా కొట్టి చంపుతున్నారని పంచాయితీ పెట్టించు- ఎవరినైనా పెద్దవారిని తీసుకెళ్లి పోలీసు కంప్లైంట్ యిస్తామని బెదరించు. లొంగకపోతే పిల్లని తెచ్చేసుకో. ఆ మాత్రం బతుకు రెండిళ్లల్లో పనిచేసుకున్నా బతకవచ్చు" అన్నాను.

పిల్లని తెచ్చుకునే అవసరం, బాధ లేకుండా ఆ పిల్లే తన కష్టాలకి, తల్లి కష్టాలకి నిప్పు పెట్టేసుకుంది. ఇంత బూడిదతోపాటు, తన పిల్లని తల్లికి అప్పగించి చచ్చిపోయింది. సుఖం వెతుక్కుంటూ వెళ్లిపోయింది. కూతురు తల్లికి రాసిన ఉత్తరం చూపించి అదే చచ్చిందని చెప్పి జైలు కెళ్ళకుండా తప్పించుకున్నారు అత్త అల్లుడు.

దెబ్బై ఐదువేల అప్పు మనవరాలి బాధ్యత మిగిలాయి యాదమ్మకి. యీ మనవరాలిని పెంచి, తల్లిలేని పిల్లని నేనుండగానే దాన్ని అయ్యచేతిలో పెట్టాలి అని యీ సారి పదేళ్లకే మనవరాలి పెళ్లి చేస్తుందేమో యాదమ్మ. అడ్డంగా తల ఆడించిన యాదమ్మ కళ్ళల్లో యీ సారి ఏదో పట్టుదల కనిపించింది.

◆ ఆంధ్రప్రదేశ్, జూన్-2001